క్లుప్తంగా

బీచ్ రోడ్డులో షూటింగ్ సందడి


లొకేషన్‌లో నటుడు సందీప్‌కిషన్

కొమ్మాది: భీమిలి–విశాఖ బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. హీరో సందీప్‌కిషన్ నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించి భీమిలి బీచ్, ఆర్‌కే బీచ్ సమీపంలోని అంబికా సీ గ్రీన్ ప్రాంతంలో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాకు ఇంకా పేరు ఖరారు కాలేదు. మరో నాలుగు రోజులు పాటు సినిమా చిత్రీకరణ ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.

పోలమాంబ ఆలయంలో అన్నదానం


ఆలయ ఆవరణలో అన్నదానం జరుపుతున్న దేవదాయశాఖ అధికారులు

తగరపువలస: ఇటీవల ముగిసిన శరన్నవ రాత్రుల ఉత్సవాలలో భాగంగా ఆదివారం సంగివలస పోలమాంబ ఆలయం వద్ద దేవదాయశాఖ భారీ అన్నసమారాధన నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, ఈవో టి.రాజగోపాలరెడ్డి ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను, అర్చకులు నరసింహమూర్తి, ఏడిద రామకృష్ణశర్మ, నాగేశ్వరరావు, నగరానికి చెందిన శ్రీహరి సేవా సమితి సభ్యులు సహాయ సహకారాలు అందించారు.

98 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ 98మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖరరావు, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు ఎం.శంకర్, రాము, కిశోర్,దివ్య, భారతి పాల్గొన్నారు.

15న రాధాకృష్ణ మహోత్సవం

తగరపువలస: నవంబరు 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా భీమిలి బీచ్‌లోని శ్రీరాధాకృష్ణ మందిరం వద్ద రాధాకృష్ణ మహోత్సవం నిర్వహించడానికి యాదవ సంఘ నాయకులు తీర్మానించారు. ఆదివారం సంగివలసలోని అక్కరమాని వెంకటరావు ఇంటి వద్ద ఈ మేరకు యాదవ నాయకుల సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు ఉత్సవ నిర్వహణకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వీరిలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, పల్ల వెంకటరావు, రామసూరప్పడు, గుడ్డాల ఎల్లయ్య, మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

సత్యసాయి సమితి సభ్యుల ర్యాలీ

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని ఆదివారం చిట్టివలస సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు ఘనంగా నిర్వహించింది. ఆదివారం ఉదయం నగర సంకీర్తన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం చిట్టివలస సమితి నుంచి కొత్త మూలకుద్దు, చిల్లపేట, తగరపువలస, బాలాజీనగర్, కార్మికవాడ మీదుగా బాబా చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. ఆనందపురం మండలంలోని గొట్టిపల్లి, మామిడిలోవ పంచాయతీలలో కూడా నిర్వహించిన అవతార ప్రకటన దినోత్సవ కార్యక్రమాలలో సమితికి చెందిన భజన మండళ్లు, బాలవికాస్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతు బజార్ లేక అవస్థలు

- కలగా మిగిలిన మినీ రైతు బజారు ఏర్పాటు
- పీఎం పాలెం ప్రజల నిత్య వేదన
- అధిక ధరలకు కూరగాయల విక్రయాలు


పీఎంపాలెం చివరి బస్టాపునకు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుపై కూరగాయలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

> 'రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తాం... దళారీ వ్యవస్థ లేకుండా చూస్తాం...నేరుగా రైతుల నుంచి వారు పండించిన ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసి, అండగా నిలుస్తాం..' ఇవి పాలక పెద్దలు, అధికారులు చెబుతున్న మాటలు. క్షేత్రస్థాయిలోని పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉంది. నిత్యం రద్దీగా ఉంటూ వేలాది మంది నివసించే పీఎంపాలెంలో రైతు బజార్ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
>
> –పీఎం పాలెం

నిత్యావసర వస్తువులు లేనిదే పూట గడవదు. ముఖ్యంగా కూరగాయలు లేనిదే ముద్ద దిగదు. పీఎం పాలెం ప్రాంతంలో రైతు బజార్ లేకపోవడంతో రోడ్డు పక్కనే విక్రయించే కూరగాయలే దిక్కవుతున్నాయి. దీంతో అత్యధిక ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోయాయి. ప్రభుత్వం సబ్సిడీపై నిత్యావసరాలను రైతు బజార్లలో అందజేస్తోంది. అయితే పీఎం పాలెం ప్రజలకు మాత్రం సబ్సిడీపై సరకులు అందడం లేదు. రైతు బజార్ లేక వ్యాపారులు ఎంత చెబితే అంతే ధరకు కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. జీవీఎంసీ ఆరోవార్డుపరిధిలోగల పీఎం పాలెంలో అనేక కాలనీలతో సుమారు 25 వేలకుపైగా జనాభాతో దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతోంది. గత టీడీపీ పాలనలో ఇక్కడకు సుమారు 3 కిలో మీటర్ల దూరంలో రైతు బజారు ఏర్పాటు చేశారు. దూరభారం కావడంతో ప్రజలు అక్కడకు వెళ్లలేని పరిస్థితి. అంతేకాకుండా కనీసం బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోకు రూ.30 చెల్లిస్తేగానీ రైతు బజార్‌కు చేరుకోలేరు. ఈ తిప్పలు పడలేక రోడ్డు పక్కన కూరగాయాలు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ మినీ రైతు బజార్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు.

మూణ్నాల ముచ్చట సంచార రైతు బజార్

గతంలో పీఎం పాలెం ప్రజలకు సంచార మినీ రైతు బజారు ద్వారా కూరగాయలు విక్రయించడానికి వాహనం ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు ఈ సేవలను ప్రజలు వినియోగించుకున్నారు. ఇంతలో ఏమైందో సంచార రైతు బాజారును ఎత్తి వేశారు. పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. కారుషెడ్ కూడలి ఏరియాలోనూ ఆఖరు బస్టాపునకు వెళ్లే రోడ్డు పొడవునా చిన్నాచితకా కాయకూరల దుకాణాలు ఉన్నాయి. నేరుగా రైతులు కాకుండా పూర్ణా మార్కెట్, ఆనందపురం తదితర ప్రాంతాలలో కొనుగోలు చేసి ఇక్కడ విక్రయాలు జరుపుతున్నారు. ఈ కారణంగా రైతు బజారు ధరల కంటే అధిక ధరలకు కూరకాయలు కొనుగోలు చేస్తున్నామని ఈ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్య సమస్యగా మారింది



ఈ ప్రాంతంలో రైతు బజారు లేక పోవండంతో కూరగాయలు కొనుగోలు చేయడం నిత్య సమస్య మారింది. రోజురోజుకూ ధరలు పెరిగిపోతున్నాయి. నెల బడ్జెట్ అదుపు తప్పుతోంది. రైతు బజారు ఉంటే అన్నిరకాల కూరగాయలు అందుబాటులో ఉంటాయి. ధరలూ నామమాత్రంగా ఉంటాయి. అధికారులు స్పందించి మినీ ఈ ప్రాంతంలో మినీ రైతు బజార్ ఏర్పాటు చేయాలి.

–డీవీఎస్ మూర్తి , పీఎం పాలెం

అదుపు తప్పతున్న బడ్జెట్



నిత్యావసరాలు దృష్టిలో ఉంచుకుని పీఎం పాలెంలో వెంటనే మినీ రైతు బజారు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. అధిక జనసాంద్రత ఉన్న ఈ ప్రాంత ప్రజల కోసం ప్రత్యేకంగా రైతు బజారు ఏర్పాటు చేయకపోవడం అన్యాయం. దీంతో అధిక ధరలకు కూరగాయలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. నెలా బడ్జెట్ అదుపు తప్పుతోంది. సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–కెఎల్ రావు, పీఎం పాలెం.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ఆకట్టుకుంటున్న యశోద, శ్రీకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు. కార్తీక దామోదర మాస ఉత్సవాలు రెండోరోజు వైభవంగా ప్రారంభమ య్యాయి. ఉత్సవాల్లో భాగంగా వేకువ జామున 4.30 గంటల నుంచి 6 వరకు ప్రత్యేక కార్యక్రమాలు, మంగళ హారతి, నర్సింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీప సమర్పణ, గజేంద్ర స్తుతి, దామోదరాష్టకం, గోపి గీత, భగవద్గీత, శిక్షాష్టకం, యుగలాష్టకం పారాయణం నిర్వహించినట్టు ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు.

ఆదర్శనగర్‌లో డ్రైనేజీలు నిర్మించండి


సంతపేట గొల్లవీధి నుంచి ఆదర్శనగర్ వైపు రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు లేని దృశ్యం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు ఆదర్శనగర్‌లో డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో మురుగు సమస్య పట్టి పీడిస్తోంది.డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని 30 ఏళ్లుగా అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. సంతపేట గొల్లవీధి నుంచి ఈఎస్ఐ ఆస్పత్రి ప్రహరీని ఆనుకుని బైపాస్‌రోడ్డు వరకు రహదారికి ఇరువైపులా డ్రైనేజీలు లేవు. సంతపేట గొల్లవీధి ప్రవేశ మార్గంలో నిర్మించిన డ్రైనేజీలను ఆక్రమించి కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. డ్రైనేజీలను ఆక్రమించడమే కాకుండా రహదారిపైకి నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. చిన్నపాటి వర్షానికి ఈ రహదారి మొత్తం చెరువులా మారిపోతుంది. సంతపేట, నమ్మివానిపేట, బైపాస్‌రోడ్డు, సబ్బివానిపేట, సంగివలస అనిట్స్ కళాశాల సరిహద్దులు కలిగిన ఆదర్శనగర్‌లో పూర్తిగా డ్రైనేజీలు లేవు. ఈ ప్రాంతంలో పలువురు ఇళ్లు నిర్మించుకున్నారు. జీవీఎంసీకి, వీఎంఆర్డీకు పన్నులు చెల్లిస్తున్నా వసతులు కల్పించడం లేదని వాపోతున్నారు. పేరుకే ఆదర్శనగర్ అయినా కొందరు ఎక్కడ పడితే అక్కడ డెబ్రిస్ పోగులు వేస్తునా జీవీఎంసీకి పట్టడం లేదు.

స్థలం ఆక్రమణపై దివ్యాంగురాలి ఆవేదన


స్థలం డాక్యుమెంట్ చూపిస్తున్న సుజాత

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడలో సర్వే నంబరు.336లో గల వికలాంగుల కాలనీలో ప్రభుత్వం 15వ ప్లాట్‌లో 90 గజాలు నివాస స్థలాన్ని ఇచ్చిందని దానిని ఏఆర్ కానిస్టేబుల్ ఆక్రమించాడని దివ్యాంగురాలైన సుజాత వాపోయింది. పలుకుబడిని ఉపయోగించి దౌర్జన్యం చేసి తమ స్థలం ఆక్రమించాడని, గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయందని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో కోర్టును ఆశ్రయించానని పేర్కొంది. ఈ వ్యవహారం కోర్టులో ఉండగా స్థలాన్ని ఆక్రమించి వైన్ షాప్‌నకు ఎలా అద్దెకిస్తారని ప్రశ్నించింది.ఆదివారం వైన్ షాపునకు వ్యతిరేకంగా స్థానికులు నిర్వహించిన ధర్నాలో ఆమె ఈ విషయాన్ని మీడియాకు వివరించింది. తాను ఈ విషయం నగర పోలీసు కమిషనర్, ఇతర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తానని చెప్పారు. తనకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

కూలేందుకు సిద్ధంగా స్తంభం


అంబేడ్కరు కూడలి వద్ద సీసీ కెమెరాలు అమర్చిన స్తంభం


స్తంభం అడుగు భాగంలో సగానికి పైగా తుప్పు పట్టిన దృశ్యం

తగరపువలస: స్థానిక అంబేద్కరు కూడలిలోని సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన స్తంభం అడుగు భాగం తుప్పు కారణంగా ఏ క్షణమైనా కూలడానికి సిద్ధంగా ఉంది. అల్ప పీడనాల వలన సంభవించే బలమైన గాలులు లేదా పొరపాటున వాహనాలు ఢీకొన్నా కూలిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం సంభవించక ముందే ఈ తుప్పు పట్టిన స్తంభాన్ని భీమిలి పోలీసులు తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొండపేట రహదారికి మోక్షం కల్పించండి


పంప్‌హౌస్ సమీపంలో అసంపూర్తిగా రహదారి నిర్మాణం


పబ్లిక్ టాయిలెట్ల వద్ద అసంపూర్తిగా రహదా


అంబేడ్కరు కూడలి సమీపంలో రహదారి దుస్థితి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు కొండపేట రహదారి అసంపూర్తిగా నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో గోస్తనీనది వద్ద పంప్‌హౌస్ నుంచి పైపులైన్ నిర్మాణం కోసం అంబేడ్కరు కూడలి వరకు ఉన్న రహదారిని తవ్వేశారు. తరువాత పండగలు, పబ్బాలు జరిగినా రహదారి బాగా లేకపోవడంతో కొండపేట వాసులు పలుమార్లు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రూ.40 లక్షలతో బీటీ రోడ్డు పునరుద్ధరించనున్నట్టు గతంలో జెడ్సీలు హామీ కూడా ఇచ్చారు. ఏడాది గడచిపోతున్నా ఈ కొండపేట రహదారికి మోక్షం లభించడం లేదు. దీంతో గతుకుల మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు పడితే ఈ గతుకులు చెరువుల్లా మారిపోతున్నాయి. దీంతో వాహనదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు జోరుగా జరిగినా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏమీ పట్టించుకోవడం లేదని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం గతుకుల రహదారికి మరమ్మతులు నిర్మించాలని కోరుతున్నారు.

నేటి నుంచి అమ్మవారి ఉత్సవాలు


ఒకే ప్రాంగణంలో ఉన్న మరిడమ్మవారి మూడు ఆలయాలు


ఉత్సవ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

భీమునిపట్నం: ఒకే ప్రాంగణంలో ఒకే అమ్మవారికి మూడు ఆలయాలు ఉండడం ఎంతో అరుదైన విషయం. అది భీమిలిలో ఉంది. ఇక్కడ మరిడమ్మవారికి ఒకే చోట మూడు ఆలయాలు ఉన్నాయి. ఇందులో రెడ్డి, బలిజ, యాదవ, తెలగ కులస్తులవారికి ఒక ఆలయం, నాగవంశీయులకు ఒక ఆలయం, ఎస్సీలకు ఒక ఆలయం ఉంది. ఆయా కులస్తులు అందులోని తమ ఆలయాలకే వెళతారు. ఉత్సవాలు కూడా విడివిడిగానే జరుగుతాయి. ఇలా ఒకే చోట ఈ ఆలయాలు ఉండడానికి పూర్వ చరిత్ర ఉంది. వందేళ్ల క్రితం అందరికి ఒకే గుడి ఉండేది. అప్పుడందరూ కలిసి పూజలు, ఉత్సవాలు నిర్వహించేవారు. కాని రానురాను వారి మధ్య అభిప్రాయభేదాలు, ఆధిపత్యపోరు రావడంతో ఇలా ఒకేచోట మూడు ఆలయాలను నిర్మించుకున్నారు. అయితే ప్రస్తుతం ఎవరి మధ్య ఎటువంటి సమస్యలు లేనప్పటికీ ఎవరికివారు తమ ఆలయాల్లోనే పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే ఇక్కడ ఉన్న మూడు ఆలయాల్లోను మహిళలే పూజారులుగా ఉండడం విశేషం.

నేటి నుంచి ఉత్సవాలు

ఇక్కడ నాగవంశ కులస్తుల అమ్మవారి ఉత్సవాలు సోమవారం ప్రారంభమవుతున్నాయి. రెండు రోజులపాటు ఉత్సవాలు జరగనుండగా ముందురోజు తొలేళ్ల మహోత్సం, రెండో రోజు అనుపు ఉత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం, సాంస్కృతిక కార్యక్రమాలు భారీ ఎత్తున జరుగుతాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. కాగా ఆదివారం ఆలయ ధర్మకర్త గాడు అప్పలనాయుడు, కమిటీ సభ్యులు ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం కొంత్యాం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. రామవరం తదితర గృహ వినియోగదారులు, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని విశాఖ జోన్–3 ఆపరేషన్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా 50వ స్వర్ణోత్సవ సభ

దాబాగార్డెన్స్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ 50వ స్వర్ణోత్సవ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు, సౌత్ సెంట్రల్ జోన్ నుంచి జోనల్ నాయకులు, పలు డివిజన్ల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ ఐసీఈయూ 50 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు, కొత్త భవనం సమకూర్చుకున్నందుకు, యూనియన్ నాయకత్వానికి, సభ్యులకు అభినందనలు తెలిపారు. 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి దోహదపడే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేటుపరం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్న సమయంలో ఏఐఐఈఏ అందులో భాగమైన ఐసీఈయూ అనేక పోరాటాలు చేస్తూ, ఇన్సూరెన్స్ రంగంలోని ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయకుండా నిలువరించగలిగినట్లు తెలిపారు.

విద్యుద్దీపాలు ఏర్పాటు చేయండి


చిట్టివలస జెడ్పీహైస్కూల్ నుంచి కొండపేట పంప్‌హౌస్‌కు వెళ్లే మార్గం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ కొండపేట పంప్‌హౌస్‌కు వెళ్లే రహదారిలో చీకటి కారణంగా సరిపడినన్ని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కొండపేట వాసులు కోరుతున్నారు. ఇటీవల చీకటి పడిన తరువాత గంజాయి బ్యాచ్ ఈ ప్రాంతవాసులను భయాందోళనలకు గురి చేస్తున్న సంగతి తెలిసిందే. చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నుంచి పంప్‌హౌస్‌తో పాటు కొండవాలు ప్రాంతంలో సరిపడినన్ని విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలంటున్నారు. ఈ మేరకు స్థానిక కార్పొరేటర్ అక్కరమాని పద్మావతి, భీమిలి జోనల్ అధికారుల దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లనున్నారు.

వివేకానందనగర్ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ ఏర్పాటు


అసోసియేషన్ సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి వివేకనందనగర్ పార్కు అభివృద్ధికి సంబంధించి వివేకానందనగర్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. ఈ సందర్భంగా ఈ ప్రాంతాల్లో వివిధ రంగాలకు చెందిన 80 మంది హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మంతెన పెద్ది రాజు, అధ్యక్షుడిగా సింగిరి మధుసూదనరెడ్డి, కార్యదర్శిగా ఆర్. ఉదయ్, ఉపాధ్యక్షులుగా టి.ఎస్. నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


తాటితూరులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం శింగనబంధ పంచాయతీలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడారు. విశాఖలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐటీ, టూరిజం, విమానయాన రంగాల్లో యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. టీసీఎస్‌లో 10 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా తాటితూరులో రూ.50 లక్షలు, శింగనబంధలో రూ.40 లక్షలు, లక్ష్మీపురంలో రూ.50 లక్షలు, టి.నగరపాలెంలో రూ.20 లక్షలు విలువైన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాల పనులకు సంబంధించి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, సర్పంచ్‌లు శిరిగుడి సంతోషి, జీవీ నారాయణ, నాయకులు పతివాడ రాంబాబు, గంటా నూకరాజు, కొప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తెన్నేటి పార్కు మెట్లమార్గం


శిథిలమైన మెట్లు

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం తెన్నేటి పార్కు నుంచి బీచ్‌కు వెళ్లే మెట్ల మార్గం శిథిలమైంది. ఈ పార్కు నుంచి బీచ్ వైపు దిగడానికి వీలుగా గతంలో వీఎంఆర్‌డీఏ మెట్ల మార్గం ఏర్పాటు చేసింది. వాటిపై నుంచి బీచ్‌లోకి సందర్శకులు దిగుతుంటారు. ఈ మెట్ల పక్కనే పిల్లలు సరదాగా కిందకు దిగడానికి వారి కోసం ప్రత్యేకంగా మార్గం నిర్మించిం. ఆర్చ్ ఆకారంలో ఏర్పాటు చేసిన ఈ మార్గంలో కొన్ని మెట్లు ఎక్కిన తర్వాత జారుతూ పిల్లలు కిందకు దిగవచ్చు. ఈ మెట్ల మార్గంలో దిగడానికి పిల్లలు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు ఈ మెట్లు శిథిలమయ్యాయి. దీంతో పిల్లలు వాటిని వినియోగించడానికి వీలుపడటం లేదు. మెట్లకు ఇరుపక్కలా చిన్న ఎత్తులో ఉన్న రక్షణ గోడలు విరిగిపోయాయి. జారుడు బల్లలాంటి భాగం శిథిలమైంది. వీఎంఆర్‌డీఏ అధికారులు ఈ పార్కును ఇటీవల ఆధునికీకరించారు. కొన్ని రూ.లక్షలు ఖర్చు చేసి పార్కును ఆధునీకరించిన అధికారులు రూ.వేలల్లో ఖర్చు అయ్యే ఇక్కడ బీచ్‌లోకి దిగే మెట్లను మాత్రం మరిచిపోవడం విశేషం. వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి పిల్లల కోసం మెట్ల మార్గాన్ని పునర్నిర్మించాలని సందర్శకులు కోరుతున్నారు.

మందుబాబుల హల్‌చల్

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంలో ఆదివారం అర్ధరాత్రి మందుబాబులు హల్‌చల్ చేశారు. నలుగురు యువకులు ఫుల్‌గా మద్యం సేవించి ఈ ప్రాంతంలో యువకులపై దాడికి యత్నించారు. పెద్దగా కేకలు వేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. వీరిని అదుపు చేసేందుకు వచ్చిన యువకులపై దౌర్జన్యం చేశారు. ప్రతి రోజూ ఇదే పనిగా ఈ ప్రాంతంలో మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించడంలేదని, ఇదే అదునుగా మందు బాబులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.